## క్లుప్తంగా

### నేటి నుంచి ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ

సిద్దవటం : మండలంలోని గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లకు, ఇద్దరు వార్డు సభ్యులకు శుక్రవారం నుంచి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఫణి రాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సభా భవనంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతున్నాయి. మండలంలోని 18 గ్రామ పంచాయతీలలోని ఉప సర్పంచ్‌లకు, ఇద్దరు వార్డు సభ్యుల్లో ఒకరు మహిళ, మరొకరు పురుషులు తప్పకుండా హాజరుకావాలని ఆమె తెలిపారు.

### 31 వరకు జీవాలకు నట్టల నివారణ మందులు


జీవాలకు మందు వేస్తున్న పశువైద్యాధికారి గణేష్

చిన్నమండెం : ఈ నెల 31వ తేదీ వరకు జీవాలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేయనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ గణేష్ తెలిపారు. గురువారం ఆయన జీవాలకు నట్టల నివారణ దోసులను జీవాలకు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 44,320 గొర్రెలు, 5,867 మేకలు ఉన్నాయన్నారు. వీటికి నట్టల నివారణలో భాగంగా ప్రభుత్వం 50 వేల దోసుల నట్టల నివారణ మందును సరఫరా చేసిందన్నారు. సన్న జీవాల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని ఆయన తెలియజేశారు.

### ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి


వాహన తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ మోహన్ కుమార్

పుల్లంపేట : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పుల్లంపేట ఎస్‌ఐ మోహన్ కుమార్ గౌడ్ కోరారు. గురువారం పుల్లంపేట బైపాస్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమతులు లేని, లైసెన్సులు, ఆర్‌సీ, హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుబ్బరాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు శ్రీకారం


పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నజీర్‌బాషా

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామ పంచాయతీలోని ఎగువగడ్డ హరిజనవాడలో పల్లె పండుగ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవపట్ల నజీర్‌బాషా, ఉపసర్పంచ్ ఆదెమ్మ, ఈఓపీఆర్‌డీ శేఖర్‌నాయక్, పంచాయతీ సెక్రటరీ గౌస్‌పీర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ రామ్మోహన్, ఏహెచ్‌కె సుమలత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### కోర్టు భవనాల డీపీఆర్‌ను రూపొందించండి


ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న సుబ్రమణ్యం

నందలూరు : నందలూరు జూనియర్ సివిల్ కోర్టు నూతన భవన డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను సత్వరం తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాలని రాజంపేట ఆర్‌అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డిను గురువారం వినతిపత్రం ద్వారా కోరినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏవి సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఈ విషయమై ఈఈ సుబ్రమణ్యం సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది టి.నూర్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా మహాపూర్ణాహుతి

వాల్మీకిపురం: టీటీడీ ఆధ్వర్యంలోని వాల్మీకిపురం శ్రీ పట్టాభిరాముడి వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, పవిత్ర వితరణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవ, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పవిత్ర వితరణం, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, చక్రస్నానం కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి వీధి ఉత్సవం కన్నులపండువగా సాగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, కృష్ణంరాజు భట్టర్, సిబ్బంది కృష్ణమూర్తి, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

# సిద్దవటం.. సమస్యల చట్రం

- ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలు
- రవాణాకు అడ్డంగా మారిన అటవీశాఖ చెక్‌పోస్టు
- గృహనిర్మాణాలను అడ్డుకుంటున్న సిద్దవటం కోట


సిద్దవటం - ఎస్.రాజంపేట మార్గంలోని గుంతల్లో నిలిచిన వర్షపునీరు

సిద్దవటం : సిద్దవటం మండలం సమస్యల వలయంగా మారింది. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయి. ప్రధానంగా రోడ్లు గుంతలమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించలేదని వాహన చోదకులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో ఎక్కడి చెత్త నిల్వలు అక్కడనే పేరుకొని పంచాయతీలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. సర్పంచ్‌లు, అధికారులు పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మేజర్ గ్రామ పంచాయతీ అయిన మాధవరం-1లో ప్రజలకు పెన్నానీరు సక్రమంగా అందడం లేదని దీంతో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు ఖాళీ బిందెలతో నిరసనలు వ్యక్తం చేసిన సందర్భాలు లేకపోలేదు. సిద్దవటం మండల ప్రజలతోపాటు పొరుగు జిల్లా వాసులు సిద్దవటం మీదుగా బద్వేల్, విజయవాడ, నెల్లూరు మరికొన్ని ప్రాంతాలకు వెళ్లే వాహనదారులకు అటవీశాఖ చెక్‌పోస్టు అడ్డంకిగా మారింది. దీంతో ప్రయాణికులు రాత్రివేళల్లో సిద్దవటం మీదుగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గతంలో రాత్రి, పగటి వేళల్లో వాహన రాకపోకలు కొనసాగుతుండేవి. చెక్‌పోస్టు గేటు వేయడంతో రాత్రివేళల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తాము అధికారంలోకి వస్తే సిద్దవటం చెక్‌పోస్టును ఎత్తివేస్తామని కూటమి నేతలు పలుమార్లు నిరసనలు తెలిపి తీరా అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మండల కేంద్రంలో ఉన్న మట్లిరాజుల కోట గ్రామ అభివృద్ధికి అడ్డుకట్టగా నిలిచింది. ప్రజలు ఎలాంటి గృహ నిర్మాణాలు చేపట్టాలన్నా అనుమతుల పేరుతో గృహాలను అడ్డుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట చుట్టూ వంద మీటర్లు నిషిద్ధ ప్రాంతంగాను, వంద నుంచి మరో 200 మీటర్ల దూరంలో ఎలాంటి కట్టడాలను నిర్మించుకోవాలన్నా పురాతత్వ పర్యవేక్షణ అధికారుల అనుమతులు తప్పనిసరి అనే నిబంధనలు ఉండటంతో నూతన గృహాలను నిర్మించుకోలేక పాత గృహాల్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. నూతన గృహనిర్మాణాలు చేపడితే నోటీసులు ఇస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.


మాధవరం-1లో రహదారి పక్కన నిల్వ ఉన్న మురుగునీరు


తాగునీటి కోసం నిరసన తెలుపుతున్న మాధవరం మహిళలు(ఫైల్)


మండల కేంద్రంలోని చావిడి వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

### దుర్వాసన వస్తోంది



డ్రైనేజీలో చెత్తాచెదారం అంతా చేరి మురుగుగా మారింది. దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. వర్షం వస్తే నీరు పోక అక్కడే నిలిచిపోతుంది. దీంతో దోమలు వ్యాపించి జ్వరాలు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. పంచాయతీ అధికారులు చెత్తాచెదారాలను తీసివేయడంతో పాటు మురుగు బెడదను తప్పించేలా చర్యలు చేపట్టాలి.

– కె.వెంకట్రామిరెడ్డి, మాధవరం-1, సిద్దవటం మండలం

### అటవీ చెక్‌పోస్టుతో ఇబ్బందులు



సిద్దవటం సమీపంలోని అటవీ అధికారులు కడప - బద్వేల్ వాహనాల రాకపోకలకు చెక్‌పోస్టు గేటు వేయడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కడపకు వెళ్లిన ప్రైవేటుగా ఉద్యోగాలు, అంగళ్లలో పని చేసే వారు, ప్రయాణికులు రాత్రి 8 గంటలు అయితే చాలు పాత బస్టాండుకు ఉరకలేయాల్సిన పరిస్థితి ఉంది. బద్వేల్‌కు వెళ్లే చివరి బస్సు మిస్ అయితే ఇక సిద్దవటం, అట్లూరు, బద్వేల్ ప్రాంతాల ప్రయాణికులకు అగచాట్లు తప్పడంలేదు. చెక్‌పోస్టు గేటును ఈ ప్రభుత్వంలో అయిన ఎత్తివేస్తారో లేదో చూడాలి.

– కె. సుబ్బరాయుడు, సిద్దవటం

## మండల అభివృద్ధికి సహకరించండి

నందలూరు : మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పుట్టగొడుగుల్లా అనధికార లేఅవుట్లు వెలుస్తున్నాయన్నారు. అలాగే ప్లానింగ్ అప్రూవల్ లేని కమర్షియల్ రూములపై ఆరా తీసి చర్యలు తీసుకోవాలని పంచాయతీ సెక్రటరీకి సూచించారు. కన్యకా చెరువుకు చేరవలసిన ప్రధాన పంట కాలువలు రోజురోజుకు కనుమరుగవుతున్నాయని వాటిపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను కోరారు. పలు గ్రామ పంచాయతీలలో వీధి కుక్కల స్వైరవిహారంపై చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాతమ్మ, వైస్ ఎంపీపీలు తుమ్మల భావన శ్రీధర్‌గౌడ్, నాయనపల్లి అనుదీప్, మండల కో-ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

### వాహనదారులకు హెచ్చరిక

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలో మోటార్ వాహనాల చట్టంకు లోబడి నెంబర్లు స్పష్టంగా కనిపించే విధంగా ఉండాలని ట్రాఫిక్ సీఐ ఎస్.విశ్వనాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనానికి ముందు, వెనుక నెంబర్లు బోర్డులు లేనిపక్షంలో వాహనాన్ని సీజ్ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

### ఘనంగా గంగ జాతర


గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్తులు

పుల్లంపేట : మండలంలోని రంగంపల్లి పంచాయతీలోని ఆర్.వడ్డిపల్లి గ్రామంలో కొలవైన గంగమ్మ జాతరను గురువారం భక్తులు వైభవంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ మాసంలో అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా భక్తులు అమ్మవారికి పొంగళ్లు, పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు యానాదయ్య, రమణ, నాగేష్, శ్రీను భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆ బ్రాందీషాపును తొలగించాలి

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు పట్టణం రైల్వేస్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రాందీషాపును తొలగించాలని బీకేఎంయూ నాయకులు గురువారం ఎక్సైజ్ సీఐ తులసీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా బీకేఎంయూ అధ్యక్షులు పండుగోల మణి మాట్లాడుతూ ఎప్పుడూ రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ రోడ్డులో బ్రాందీషాపును ఎలా ఏర్పాటు చేస్తారని వారు ప్రశ్నించారు. స్టేట్ బ్యాంక్, కాలేజీ, పాఠశాలకు వెళ్లే విద్యార్థులతో ఎప్పుడూ రద్దీగా ఉండే ఆర్‌ఎస్ రోడ్డు, మెయిన్ బజార్‌లో బ్రాందీషాపు తొలగించాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు మాది మంచి ప్రభుత్వం అంటూ సంకలు గుద్దుకుంటూ ప్రచారం చేస్తున్నారని, ఎప్పుడు రద్దీగా ఉన్న ప్రాంతంలో మద్యంషాపు ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బంది పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. అనంతరం ఈ మేరకు వారు సీఐ తులసీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.జయరామయ్య, రమణయ్య, వెంకటరమణ, వెంకటేష్, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, భాగ్యలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.


ఎక్సైజ్ సీఐ తులసీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, మహిళలు

### విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కురబలకోట: సిద్దారెడ్డిగారిపల్లెకు చెందిన శిరీష (21) గురువారం ఇంటి వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంట్లో ఉంచిన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో తిరుపతికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయండి

సిద్దవటం : వాయుగుండం కారణంగా గత మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పెన్నానదిలో నీటి మట్టం పెరుగుతుందని మండలంలోని లోతట్టు ప్రాంతాల్లోని గ్రామీణ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించామని తహసీల్దారు మురాషావలి తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఆయన రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని జంగాలపల్లె, గాండ్లపాలెం, ఆకులవీధి, వంతాటిపల్లి, ఎస్.రాజంపేట, జ్యోతి, గొల్లపల్లె, వెంకటాయపల్లె, లింగంపల్లె, కడపాయపల్లె తదితర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని వీఆర్‌ఓలకు ఆదేశించారు. వర్షాల కారణంగా గ్రామాల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రసాద్, వీఆర్‌ఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దారు మురాషావలి

## ఇసుక రీచ్ పరిశీలన

నందలూరు : మండలంలోని టంగుటూరు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన నూతన ఇసుక రీచ్‌ను రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఆమె ఇసుక రీచ్‌కు సంబంధించిన హద్దులను ఏర్పాటు చేశారు. ఇసుక రీచ్ యజమానులు నియమ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమర్నాథ్, ఎంపీడీఓ సుజాతమ్మ, మాజీ ఎంపీపీ లక్ష్మీనరసయ్య, సర్పంచ్ మైనుద్దీన్, చుక్క యానాది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వైఖోమ్

### కంపచెట్ల తొలగింపు

వీరబల్లి : మండలంలోని మట్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లంపల్లి నుంచి బోడిమల్ రెడ్డిగారిపల్లి ప్రజల కోరిక మేరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను, ముళ్లపొదలను గురువారం ఆ గ్రామ సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి సొంత నిధులతో జేసీబీ సహాయంతో గ్రామస్తులతో కలిసి తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించారు.


ముళ్లపొదలను తొలగింపజేస్తున్న సర్పంచ్

# వాల్మీకి మహర్షి జీవితం మానవాళికి ఆదర్శం

- ఘనంగా రామాయణ రూపకర్త జయంతి
- నివాళి అర్పించిన నాయకులు, అధికారులు, వాల్మీకి సోదరులు


వీరబల్లి: జెడ్పీహెచ్‌ఎస్‌లో..


చిన్నమండెం: మల్లూరులో వాల్మీకి మహర్షి జయంతిలో పాల్గొన్న వాల్మీకులు


రాజంపేట టౌన్: వాల్మీకి జయంతి వేడుకలో పాల్గొన్న పోలా తదితరులు

రాజంపేట టౌన్ : వాల్మీకి జీవితం మానవాళికి ఆదర్శమని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడి తెలిపారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డు సర్కిల్‌లో ఉన్న వాల్మీకి విగ్రహం వద్ద రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ నల్లబోతుల ఈశ్వరయ్య ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలా ముఖ్య అతిథిగా పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం పోలా శ్రీనివాస్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. కుటుంబ విలువలు, అన్నదమ్ములు, భార్యభర్తల బంధం, అనుబంధాల గురించి రామాయణం ద్వారా వాల్మీకి అందించిన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్.ఈశ్వరయ్య మాట్లాడుతూ రామాయణాన్ని మధుర కావ్యంగా మలచిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని తెలిపారు. భారతదేశం గొప్పతనాన్ని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తులను మనం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనావుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు జెనుగు కృష్ణారావుయాదవ్, గోవిందు బాలకృష్ణ, శ్రీనివాసులుయాదవ్, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

**మహర్షి వాల్మీకి స్ఫూర్తిప్రదాత**

సంబేపల్లె : రామాయణ మహాకావ్య రచయిత మహర్షి వాల్మీకి మనదేశ వారసత్వపు మహాపురుషుడని నేటి తరానికి స్ఫూర్తి ప్రదాతని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంస్కృతంలో రాసిన మొదటి కావ్యం కావడంతో రామాయణాన్ని ఆది కావ్యమని అంటారన్నారు. వాల్మీకి బోయవాడిగా చెడు మార్గం నుంచి దైవికం వైపు మరలి సంస్కృతంలో 24 వేల శ్లోకాలు ఏడు కాండాలతో మానవాళికి అద్భుతమైన రామాయణ కావ్యాన్ని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.నరసింహారెడ్డి, బాషా, విజయసారధిరెడ్డి, రామయ్య, సురేంద్రరాజు, రవిశంకర్, రవిప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

**బెటాలియన్‌లో..**

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో గురువారం మహర్షి వాల్మీకి జయంతి వేడకలను ఘనంగా నిర్వహించామని బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ నాగేశ్వరప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలానే తహసీల్దారు కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా తహసీల్దారు మురాషావలి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆర్‌ఐ, ఏఎస్‌ఓ, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.భాస్కర్ రెడ్డి అధ్యక్షతన గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రమేష్, వివిధ విభాగాల కో-ఆర్డినేటర్‌లు దయానందం, డాక్టర్ కె.రమేష్, ఎస్.సుబ్రమణ్యం రాజు, దాసరి మోషేలు పాల్గొన్నారు.

**రాజంపేట పురపాలికలో..**

రాజంపేట : పురపాలిక సంఘం కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మహర్షి వాల్మీకి మహోన్నత ఇతిహాసమైన రామాయణం ద్వారా శ్రీరాముని చరిత్రను తెలియజేశారన్నారు. తత్వబోధన మనల్ని మేలైన మార్గంలో ముందుకు నడిపించాలన్నారు. వాల్మీకి చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం వివిధ విభాగాల అధికారులు ఈశ్వరరెడ్డి, హరి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

**వీరబల్లిలో..**

వీరబల్లి : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

**చిన్నమండెంలో..**

చిన్నమండెం : సమస్త మానవాళికి వాల్మీకి మహర్షి రచించిన రామాయణ మహాకావ్యం ఎంతో ఆదర్శమని అన్నమయ్య జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు మండ్ల జయశంకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్లూరు గ్రామం కొత్తపేటలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణం స్ఫూర్తితో కుటుంబ, మానవతా విలువలను పెంపొందించుకుని ధర్మబద్ధంగా జీవించాలని సూచించారు.


రాజంపేట: వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కమిషనరు బిల్లా నాగేశ్వరరావు


రైల్వేకోడూరు అర్బన్: వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


సంబేపల్లె: వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు


సిద్దవటం: బెటాలియన్‌లో నివాళి అర్పిస్తున్న ఇన్‌చార్జి కమాండెంట్ నాగేశ్వరప్ప

### బీసీ వేదిక ఆధ్వర్యంలో ఘన నివాళి

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని బీసీ వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ముందుగా విశ్రాంత ఉపాధ్యాయులు, ఆధ్యాత్మిక వేత్త ఆదిశ్రీ నూకల రవీంద్ర పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి ఒక వర్గానికి చెందిన వారు కారని, కారణజన్ముడని కొనియాడారు. కుటుంబ విలువలు రామాయణంలో దేశానికి తెలియజేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంతకుముందు వాల్మీకి చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.రామచంద్రయ్య, కృష్ణయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, ఆదికేశవులు తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీసీ నాయకులు